అవ్వాతాతల మోముల్లో ఆనందం

- కొత్త పింఛన్ల మంజూరు
- గోపాలపురం నియోజకవర్గంలో 2530 మందికి లబ్ధి
- మొత్తం పింఛన్లు 46,189
- నెలవారీ పంపిణీ సొమ్ము రూ.12.14 కోట్లు



ద్వారకాతిరుమలలో లబ్ధిదారులకు కొత్త పింఛను సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు (ఫైల్)

దేవరపల్లి: కొత్త పింఛన్లు మంజూరవడంతో అవ్వా తాతలు సంబరపడి పోతున్నారు. కన్నబిడ్డలు ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో అనేక కష్టాలు పడుతున్న అవ్వాతాతలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకులా నిలిచారు. నేనున్నానంటూ భరోసా కల్పించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ నెలలో కొత్త పింఛన్లు మంజూరు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను అధికారులు పరిశీలించి అర్హత గల లబ్ధిదారులను గుర్తించారు. వారందరికి ఈ నెల 13 నుంచి ప్రభుత్వం పింఛను మంజూరు చేసి నిధులు విడుదల చేసింది. పింఛన్ సొమ్మును ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. తొలిసారిగా పింఛన్ సొమ్ము రూ.2750 అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ వచ్చింది. కష్టాలు తీరినట్టేనని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు అంటున్నారు. తమను పెద్ద కొడుకులా ఆదుకున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి రుణం తీర్చుకుంటామని చెబుతున్నారు.

మండలాల వారీగా పింఛన్ల వివరాలు

మండలం	పాత పింఛన్లు	కొత్త పింఛన్లు	మొత్తం
దేవరపల్లి	11,643	620	12,263
గోపాలపురం	8,733	651	9,384
నల్లజర్ల	11,710	738	12,448
ద్వారకాతిరుమల	11,573	521	12,094
మొత్తం	43,659	2,530	46,189

46,189 మందికి పింఛన్లు

గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 46,189 మంది ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా వైఎస్సార్ పింఛన్ కానుక అందుకుంటున్నారు. ఆగస్టు వరకూ 43,659 మందికి పింఛన్లు పంపిణీ చేయగా, సెప్టెంబరు నుంచి 46,189 మందికి పంపిణీ చేస్తున్నారు. కొత్తగా 2,530 మందికి ఈ నెలలో పింఛన్లు మంజూరు చేశారు. ప్రతి నెలా సుమారు రూ.12.14 కోట్ల సొమ్మును పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా. ఎంతోకాలంగా పింఛన్ కోసం ఎదురు చూశాం. జగనన్న దయతో ఇన్నాళ్లకు పింఛను మంజూరైంది. చాలా ఆనందంగా ఉంది.నాకు నలుగురు సంతానం. ఎవరూ చూడడం లేదు. కూలి చేసుకుని జీవిస్తున్నాను. పింఛన్ సొమ్ము మందులకు, తినడానికి సరిపోతుంది.

– చెప్పుల అచ్చమ్మ, లబ్ధిదారు, యాదవోలు, దేవరపల్లి

పెద్దన్నలా ఆదుకున్నాడు



ముఖ్యమంత్రి జగనన్న పెద్దన్నలా ఆదుకున్నాడు. ఎనిమిది నెలల క్రితం నా భర్త ప్రమాదంలో మృతి చెందాడు. ఎలా జీవించాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న నాకు జగనన్న వితంతు పింఛను మంజూరు చేసి కుటుంబాన్ని ఆదుకున్నాడు. పింఛను అందడంతో మనోధైర్యం వచ్చింది. నాలాంటి ఎంతో మంది అభాగ్యులను జగనన్న ఆదుకొంటున్నాడు. వారికి రుణపడి ఉంటాను.

– వర్థి దుర్గాదేవి, లబ్ధిదారు, నల్లజర్ల

నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నా..



భర్త చనిపోయి నాలుగేళ్లయింది. అప్పటి నుంచి పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాను. రేషన్ కార్డులో సాంకేతిక సమస్య వల్ల ఇంతకాలం మంజూరు కాలేదు. బీపీ, షుగర్ వ్యాధితో బాధ పడుతున్నా. మందులకు నెలకు రూ.4 వేలు ఖర్చవుతుంది. పింఛన్ మంజూరు కావడంతో ధైర్యం వచ్చింది. తొలి పింఛన్ అందుకోవడం ఆనందంగా ఉంది.

– అయినపర్తి మంగ, లబ్ధిదారు, యాదవోలు, దేవరపల్లి మండలం

క్లుప్తంగా

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.1.13 లక్షలు



గుబ్బాలమ్మ వారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలోని గుబ్బాలమ్మ వారి ఆలయ హుండీని బుధవారం తెరిచి లెక్కించారు. 93 రోజులకు హుండీ ద్వారా రూ.1,13,317 ఆదాయం వచ్చిందని ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగిన హుండీ ఆదాయం లెక్కింపులో ట్రస్ట్ బోర్డు చైర్మన్ వడ్డి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళి, మార్గాని సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత' ఆర్థిక సాయం

తాళ్లపూడి: స్థానికుడైన కిలాని లక్ష్మణరావు రెండు కాళ్లూ పనిచేయక పోవడంతో ట్రై సైకిల్‌పై తిరుగుతున్నాడు. అతడికి మానవత స్వచ్ఛంద సంస్థ బుధవారం రూ.ఐదు వేల ఆర్థిక సాయం చేసింది. ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని లక్ష్మణరావుకు అందజేశారు. ఆ సంస్థ కోశాధికారి సీహెచ్ ఆంజనేయులు మరో రూ.500 సాయం చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు వి.చంద్రయ్య, ఎ.హనుమంతరావు, తిగిరిపల్లి దోసాలు, సనపల రాజశేఖర్, తుంపూడి నాగభూషణగుప్త తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో పశివేదల ఎల్‌ఏసీఎస్ జిల్లాలో ప్రథమం

కొవ్వూరు: పశివేదలలోని ది రంగరాయ లార్జ్ సైజ్డ్ కో–ఆపరేటివ్ సొసైటీ (ఎల్‌ఏసీఎస్) గత ఆర్థిక సంవత్సరంలో రూ.1.18 కోట్ల నికర లాభం ఆర్జించినట్టు ఆ సొసైటీ అధ్యక్షుడు వేములపల్లి రామారావు చెప్పారు. ఆ సొసైటీ మహాజన సభను బుధవారం రామారావు అధ్యక్షతన నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ నికర లాభం ఆర్జనలో తమ సొసైటీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. దీంలో సభ్యులకు 15 శాతం డివిడెంట్ అందించాలని సమావేశంలో తీర్మానించారు. ఇప్పటి వరకూ రూ.11 కోట్ల డిపాజిట్లు సేకరించామని చెప్పారు. డీసీసీబీ నుంచి రూ.9.50 కోట్ల రుణం తీసుకున్నామన్నారు. సభ్యులకు రూ.21 కోట్ల మేర రుణాలు అందించామన్నారు. తమ సొసైటీ వద్ద రూ.6.50 కోట్ల రిజర్వ్డ్ నిధి ఉందన్నారు. రైతులకు రూ.3.50 కోట్ల విలువైన ఎరువులను విక్రయించామన్నారు. సొసైటీ త్రీమన్ కమిటీ సభ్యులు కరుటూరి రాంబాబు, దాసరి వెంకట్రాయుడు, గుడపాటి విశ్వనాథం, వేగి సూర్యారావు, కార్యదర్శి కరుటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణలో ప్రజలది కీలక పాత్ర



సింగరాజుపాలెంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ

నల్లజర్ల: దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమైనదని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. దోమల నివారణపై సింగరాజుపాలెంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలన్నారు. ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. లార్వాను కనుగొనడంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలుత గ్రామంలో మలేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి ఇందిర, ఎం.ఎల్.హెచ్.పి సాయినాద్, ఆరోగ్యసహాయకులు,ఆశాకార్యకర్తలు,అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలపై దృష్టి పెట్టండి

కొవ్వూరు: ప్రతి బూత్ పరిధిలో కొత్త ఓటర్ల చేర్పులతో పాటు మృతి చెందిన ఓటర్ల తొలగింపుపై కూడా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు జొన్నకూటి విజయ్ మోహన్‌కుమార్ సూచించారు. వైఎస్సార్ సీపీ పోలింగ్ బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన సదస్సు బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద జరిగింది. సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా డబుల్ ఎంట్రీ ఓట్లు, దొంగ ఓట్లు నమోదైతే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తొలగింపజేయాలన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కొనసాగుతున్నందున పార్టీ స్థానిక నాయకులందరూ ఓటర్ల జాబితాలపై దృష్టి పెట్టాలన్నారు. సదస్సులో వైఎస్సార్‌సీపీ కొవ్వూరు, చాగల్లు మండల శాఖల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, కొవ్వూరు పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగ్గిపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల విత్తనాలు, నారు పంపిణీ



అనంతపల్లిలో ఎస్సీ రైతులకు కూరగాయల నారు, విత్తనాలు అందిస్తున్న ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు

నల్లజర్ల: వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే కూరగాయల సాగు ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుకోవచ్చని వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. ఇమ్మానియేలు అన్నారు. ఐసీఏఆర్, ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మండలంలోని అనంతపల్లి, తెలికిచెర్ల గ్రామాల్లోని ఎస్సీ, సన్నచిన్నకారు రైతులకు బుధవారం వివిధ రకాల కూరగాయల విత్తనాలు, నారు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ ప్రాజెక్ట్ సమయంలో కూరగాయలు సాగుదారులకు చెద నిర్వహణ పరికరాలను అందిస్తామన్నారు. అసోసియేట్ డీన్ డాక్టరు మాధవి మాట్లాడుతూ కూరగాయల పంటల ఐపీఎం అనేది రైతుల జీవనోపాధిని పెంచే ప్రాజెక్ట్ అన్నారు. డాక్టరు ఏవీడీ దొరాజీరావు, ఏవో కె.కమల్‌రాజ్, ఉద్యానశాఖాధికారి బబిత, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, రైతు ప్రతినిధి శ్రీనుబాబు, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

సొంతిల్లు, సంక్షేమం మా ప్రభుత్వ విధానం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- పెరవలిలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన
- జగనన్న కాలనీలో విద్యుత్తు లైన్ ప్రారంభం



పెరవలి జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: సొంతిల్లు లేని పేదలు, సంక్షేమ పథకాలు అందని అర్హులైన కుటుంబాలు రాష్ట్రంలో ఉండరాదనేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.90 లక్షల వ్యయంతో పెరవలిలో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పెరవలి జగనన్న కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లలో వెచ్చిస్తుంటే ఆ అభివృద్ధిని అడ్డుకునేందుకు విపక్షాలు కోర్టుల్లో కేసులు వేస్తున్నాయన్నారు. అనేక అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా పెరవలి ప్రజలకు గత నాలుగున్నరేళ్లలో రూ.30 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఇలాంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. తాను రాజకీయాలు చేయాడానికి రాలేదని, కేవలం నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటానికే వచ్చానన్నారు. టీడీపీ, జనసేన పార్టీల మాదిరిగా ఒకటి చెప్పి మరొకటి చేయబోమని, చెప్పింది, చెప్పనవి కూడా ఎన్నో చేశామన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా పేదల నివాసానికి సెంటు భూమయినా ఇచ్చిందా? అని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, పెరవలి సర్పంచ్ గంగోలు సీతమ్మ, జోసెఫ్, పార్టీ పెరవలి శాఖ అధ్యక్షుడు పంపన అంజిబాబు, యువ నాయకుడు సన్నీ, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి నాగేశ్వరరావు, కిషోర్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్లతో మరో సువర్ణాధ్యాయం

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- నిడదవోలు పట్టణంలో ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: ఆహా క్యాంటీన్ల ఏర్పాటు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మరో సువర్ణాధ్యాయం అని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనే మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆదినారాయణ బోణీ చేశారు. అనంతరం చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో మహిళల ఆధ్వర్యంలో నిర్వహించేలా ఆహా క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభిస్తోందన్నారు. మార్కెట్ ధర కన్నా తక్కువ రేటుకు ఆహార పదార్థాలను అందించడంతో పాటు, మహిళలకు స్వయంగా ఉపాధి కల్పించడం ఈ క్యాంటీన్ల లక్ష్యమన్నారు. పట్టణాలకు వివిధ అవసరాలు నిమిత్తం వచ్చే వారితో పాటు, పట్టణంలోని పేదలు కూడా ఆహా క్యాంటీన్‌లను వినియోగించుకోవచ్చన్నారు. మహిళలను బ్యాంకులతో టై అప్ చేసి బ్యాంకు రుణం ద్వారా ఆహా క్యాంటీన్‌లను అన్ని మున్సిపాలిటీల్లో ప్రారంభిస్తున్నారన్నారు. మెప్మా జిల్లా అధికారి కె. మోహన్‌కుమార్ మాట్లాడుతూ మినీ మీల్స్ రూ.50, మినీ చికెన్ బిర్యానీ రూ.50, మినీ వెజ్ బిర్యాని రూ.40, కూరలు రూ.20, నాలుగు ఇడ్లీ రూ.20, రెండు పూరీ రూ.20, రెండు గారెలు రూ.20, నాలుగు బజ్జీలు రూ.20, టీ రూ.05, కాఫీ రూ.10 కు విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, ఉసురుమర్తి జాన్‌బాబు, గుర్రం జేమ్స్, మెప్మా టీఎంసీ శివప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రియ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమంలో రాజకీయాలను చూడబోం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కాటకోటేశ్వరంలో రెండో రోజూ గడప గడపకూ..



గ్రామాభివృద్ధి పనులపై నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి

నిడదవోలు రూరల్: సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు కానీ, పార్టీలు కానీ చూసేది లేదని, అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకు పథకాలు చేరుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరంలో బుధవారం రెండో రోజు ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి రామచంద్రరావు, కోసూరి అప్పారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి కమిటీలు ఆమోదం తెలిపితేనే గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ కార్డులు అందేవన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలంతా సంతోషంగా పథకాలు అందుతున్నాయని స్వచ్ఛందంగా తన దృష్టికి తెస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీల అధ్యక్షులు గుంటుపల్లి కృష్ణమూర్తి, యాళ్ల రామారావు, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, పార్టీ నాయకులు కారింకి సూర్యచంద్రం, రేలంగి వెంకటేశ్వరరావు, కారింకి సత్యనారాయణ, ఉల్లి పోశిహరిశ్చంద్రప్రసాద్, గుంటుపల్లి శివ పాల్గొన్నారు.

చిన్నారుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

నల్లజర్ల: పోషకాహార లోపం వల్ల ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో రక్తహీనత సమస్యలు తలెత్తుతున్నాయని పోతవరం ఏఎన్ఎం మహాలక్ష్మి చెప్పారు. ప్రతి నెలా విద్యార్థుల రక్త నమూనాలను పరీక్షించి రక్త హీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు అందిస్తున్నట్టు ఆమె తెలిపారు.పోషకాహా లోపం వల్ల కొందరు చిన్నారుల్లో ఎత్తుకు తగ్గ బరువు, ఎదుగుదల ఉండడం లేదని ఆమె చెప్పారు. అటువంటి వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించాక వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నామన్నారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన



పోతవరంలో తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుందరి

నల్లజర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ వైబీ సుందరి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా పోతవరంలోని 49వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమతుల ఆహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పోషకాహార లోపం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. మునగలో సమృద్ధిగా ఎ విటమిన్ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా తృణ ధాన్యాలతో తయారు చేసే వంటకాలను తల్లులకు చూపించి వారికి అందించారు. కార్యక్రమంలో పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యురాలు పాపా నాగేశ్వరరావు, ముప్పిడి వెంకటరత్నం, ఏసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, కార్యకర్తలు అరుణకుమారి, సుశీల, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: అన్నవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. మండలంలోని పిట్టల వేమవరం, కడింపాడు, మల్లేశ్వరం అంగన్‌వాడీల సిబ్బంది కూడా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అన్నవరప్పాడు సర్పంచ్ పంతం బాలసుందరి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఆకుల అనంతలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజాక్షి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వాడపల్లిలో గర్భిణులకు సీమంతాలు

కొవ్వూరు: ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలని ఐడీడీఎస్ సీడీపీవో డి. మమ్మీ సూచించారు. జాతీయ పోషకాహారం మాసోత్సవంలో భాగంగా మండలంలోని వాడపల్లి గ్రామంలో బుధవారం బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ఐ.పంగిడి, వాడపల్లి సెక్టార్ల పరిధిని బాలింతలు, గర్భిణులకు ఐసీడీఎస్, అమెరికా ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుక వివరించారు. హిందూస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ కంపెనీ వారికి పండ్లు పంపిణీ చేసింది. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఉదయం హైస్కూల్లోని కిషోర బాలికలతో కలిసి రక్తహీనతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యంగా ఉన్న ముగ్గురు చిన్నారులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అమెరికన్ ఇండియా ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ వీవీ దీపిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, పద్మిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కొవ్వూరు మండలం వాడపల్లిలో గర్భిణులకు సీమంతాలు

ప్రతి కుటుంబం ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం

నిడదవోలు: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా జీవించాలనేదే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. ఈ కార్యక్రమం ఇంటింటి సర్వేపై హెల్త్ సెంటర్ల వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. పట్టణంలోని ఏడు సచివాలయాల పరిధిలో గురువారం నుంచి ఇంటింటి సర్వే మొదలు పెట్టాలన్నారు. 15 రోజుల పాటు నిర్వహించే సర్వేలో ప్రతి కుటుంబంలో ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించాలన్నారు. అలాంటి వారిని అక్టోబర్ 11న నిర్వహించే వైద్య శిబిరాలకు తరలించి వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి. హేనా మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన వారి ఆరోగ్య సమస్యలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడు వాసులకు బుధవారం అవగాహన కల్పించారు. పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.అక్టోబర్ మూడో తేదీన గ్రామంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారని వారు చెప్పారు. ఈ లోగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య సర్వే నిర్వహిస్తారన్నారు. గ్రామస్తులకు కరపత్రాలు అందజేశారు.

దాతకు తెలగా సంఘం వేదికపై సన్మానం



చాగల్లులో తెలగా సంఘం కళావేదికపై కోట సూర్యారావును సత్కరిస్తున్న గంద్రోతు సురేంద్రకుమార్ తదితరులు

చాగల్లు: స్థానిక తెలగా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్ అన్నారు. విజయదుర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడైన కోట సూర్యారావును తెలగా సంఘం గణపతి నవరాత్రుల ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది. తెలగా సంఘం వినాయకుడి గుడి వద్ద నూతన కళావేదిక నిర్మాణానికి సూర్యారావు తన సోదరుడు కోట కృష్ణ జ్ఞాపకార్థం భారీ విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, అనిశెట్టి సూర్యం, శ్రీ రంగం అన్నవరం, మైలవరపు ఆదేష్ తెలగాసంఘం పెద్దలు పాల్గొన్నారు. కాగా బ్రాహ్మణగూడెం, గరప్పాడు, కలవలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం బుధవారం ఘనంగా సాగింది.

నిడదవోలు: స్థానిక గణేష్ చౌక్ సెంటర్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దాత పునిత్ ఐ క్లినిక్ వైద్యుడు మానేపల్లి స్వామి నాయుడు సహకారంతో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డాన్స్ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.